సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం । 11 । జూలై । 2023



టెండర్లు 'చేప'డుతున్నారు..

జిల్లాలోని జలాశయాలు, చెరువుల్లో ఆగస్టులో చేప పిల్లల పంపిణీకి మత్స్యశాఖ అధికారులు టెండర్లు ఆహ్వానిస్తున్నారు. 8లో



భారీగా గంజాయి స్వాధీనం

జిల్లాలోని మూడు ప్రాంతాల్లో పోలీసులు 306 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని తొమ్మిది మందిని అరెస్ట్ చేశారు. 8లో



వాతావరణం

జిల్లాలో మంగళవారం ఉష్ణోగ్రత కొంత ఎక్కువగానే నమోదవుతుంది. రాత్రి వాతావరణం చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

ముత్తంగి అలంకరణలో రామయ్య



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారు ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతి సోమవారం స్వామి వారిని ఈ రూపంలో అలంకరించటం ప్రత్యేకత. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ఐటీడీఏలో ఇంటర్ స్పాట్ కౌన్సెలింగ్



కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులు

భద్రాచలం: గిరిజన సంక్షేమ శాఖ గురుకులం ఆధ్వర్యంలో నడుస్తున్న కళాశాలల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో మిగిలిన సీట్లకు సోమవారం ఐటీడీఏలో స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించారు. కృష్ణసాగర్ ఆర్‌జేసీ ప్రిన్సిపాల్ హరిసింగ్ ఆధ్వర్యంలో జరిగిన కౌన్సెలింగ్‌లో భద్రాచలం, సుదిమళ్ల, మణుగూరు, కొత్తగూడెం, అన్నపురెడ్డిపల్లి, అంకంపల్లి కళాశాలల్లో ఖాళీగా ఉన్న 269 సీట్లు భర్తీ చేశారు. విద్యార్థుల సర్టిఫికెట్లు, ఇతర ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి అడ్మిషన్లు అందజేశారు. కార్యక్రమంలో భద్రాచలం, మణుగూరు, సుదిమళ్ల, అంకంపాలెం కాలేజీల ప్రిన్సిపాళ్లు దేవదాస్, పద్మావతి, అరుణకుమారి, డేవిడ్ పాల్గొన్నారు.

టీబీ అనుమానితులకు పరీక్షలు నిర్వహించాలి

పాల్వంచరూరల్: మండల పరిధిలోని ఉల్వనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా టీబీ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ శ్రీనివాస్ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దగ్గుతో కూడిన జ్వరం, బరువు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే పరీక్షల కోసం జిల్లా కేంద్ర ఆస్పత్రికి పంపించాలని డాక్టర్ తేజస్వినికి సూచించారు. అనంతరం వైద్యసిబ్బంది, ఆశా వర్కర్లతో సమావేశం నిర్వహించారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటాలి

పాల్వంచ: రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో విద్యార్థులు సత్తా చాటాలని టీఎస్ జెన్‌కో ట్రైనింగ్ సెంటర్ సీఈ శ్రీనివాసబాబు అన్నారు. స్థానిక టీఆర్‌సీ ఇండోర్ స్టేడియంలో సోమవారం రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికలు నిర్వహించగా అండర్ 11, 13, 15, 17, 19 రాష్ట్రస్థాయి బాల బాలికల జట్లకు భూక్యా రిత్విక శ్రీ, తులసీ శ్రీజ, నుసరత తబుసుమ్, కావ్యశ్రీ, కార్తీక రెడ్డి, మౌనిక, కావ్యాంజలి, భవ్య, వరుణ్, ఆనంద్, రోహిత్ కుమార్, శశాంక్, నోయల్ విన్సెంట్, మహేశ్, సైనిస్ బెన్‌దాస్ ఎంపికయ్యారు. వీరికి ప్రశంసపత్రాలు, బహుమతులు అందించి అభినందించారు.



సారపాకలోని బీపీఎల్ కర్మాగారం

మరో మణిహారం..

భద్రాచలం పేపర్ బోర్డ్‌కు భారీ పెట్టుబడి

- రూ. 2,600 కోట్లతో ఎనిమిదో యూనిట్ స్థాపనకు గ్రీన్ సిగ్నల్
- 14న ప్రజాభిప్రాయ సేకరణ
- కాలుష్యంపై దృష్టి సారించాలంటున్న స్థానికులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: దశాబ్దకాలంగా పారిశ్రామికంగా స్తబ్దుగా ఉన్న జిల్లాకు భారీ పెట్టుబడులు రాబోతున్నాయి. రూ.2600 కోట్ల వ్యయంతో సారపాకలో ఎనిమిదో యూనిట్‌ను నెలకొల్పేందుకు ఇండియన్ టొబాకో కార్పొరేషన్ (ఐటీసీ) లిమిటెడ్ సన్నాహాలు చేస్తోంది. ఇంతకాలం కాగితాలకే పరిమితమైన ఈ ప్రాజెక్టు ఇప్పుడు కార్యరూపం దాల్చే దిశగా కదులుతోంది.

1979లో మొదలు

సింగరేణి బొగ్గు గనులు, గోదావరి జలాలను ఆధారంగా చేసుకుని జిల్లాలో శతాబ్దం క్రితమే పారిశ్రామిక రంగం ప్రారంభమైంది. కేటీపీఎస్, స్పాంజ్ ఐరన్, ఏపీ స్టీల్స్, నవభారత్, హెవీ వాటర్ ప్లాంట్ తదితర పరిశ్రమలు జిల్లాలో కాలుమోపాయి. ఈ క్రమంలోనే 1979లో గోదావరి తీరాన భద్రాచలం పేపర్ బోర్డ్ లిమిటెడ్ కర్మాగారం ఏర్పాటైంది. 10,000 టన్నుల వర్జిన్ పేపర్ ఉత్పత్తి సామర్థ్యంతో మొదలైన ఈ పరిశ్రమ నేడు సాలీనా 7.5 లక్షల టన్నుల వర్జిన్ పేపర్ తయారు చేసే స్థాయికి చేరుకుంది. ప్రస్తుతం ఈ కర్మాగారంలో 1400 మంది పర్మనెంట్, 6,500 మంది కాంట్రాక్ట్ కార్మికులు పని చేస్తున్నారు. ఇప్పటివరకు దశల వారీగా ఏడు యూనిట్ల ద్వారా ఉత్పత్తి జరగగా ఇప్పుడు ఎనిమిదో యూనిట్ నెలకొల్పేందుకు రంగం సిద్ధమైంది.

ప్రజాభిప్రాయ సేకరణ

భూసేకరణ సమస్య లేకపోవడంతో ప్లాంట్ విస్తరణకు ఐటీసీ బోర్డు నుంచి గ్రీన్ సిగ్నల్ లభించింది. ప్లాంట్ నిర్మాణానికి సంబంధించిన డీపీఆర్ సిద్ధమైంది. దీంతో ఈనెల 14న ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనున్నారు. మరోవైపు ఐటీసీ ప్లాంట్ నుంచి నిర్దేశిత ప్రమాణాలకు మించి వాయు, జల కాలుష్యం వెలువడుతోందనే ఆరోపణలు ఉన్నాయి. ఈ మేరకు ప్లాంట్ చుట్టూ ఉన్న గ్రామాల్లో కొన్ని ప్రజా సంఘాల నాయకులు, ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. గత వారం రోజులుగా ఆందోళనలు సైతం కొనసాగుతున్నాయి. దీంతో 14న జరిగే ప్రజాభిప్రాయ సేకరణపై ఉత్కంఠ నెలకొంది.

అంతర్జాతీయ ప్రమాణాలతో..

భద్రాచలం పేపర్ బోర్డు పరిశ్రమ ప్రారంభమైనప్పుడు దీన్ని పూర్తి స్థాయిలో బొగ్గు ఆధారిత పరిశ్రమగా స్థాపించారు. దీంతో వాయు కాలుష్యం తీవ్ర స్థాయిలో ఉండేది. అదే విధంగా పరిశ్రమ నుంచి వెలువడే జల వ్యర్థాలను క్లోరినేషన్ ప్రక్రియ ద్వారా శుద్ధి చేసేవారు. అయినా మలినాలు పూర్తి స్థాయిలో తొలగించడం సాధ్యపడేది కాదు. కానీ కాలక్రమేణా అంతర్జాతీయంగా క్లోరినేషన్ ప్రక్రియకు స్వస్తి పలికారు. ఇదే క్రమంలో ఐటీసీ – భద్రాచలం ప్లాంట్‌లో సైతం దశల వారీగా క్లోరినేషన్‌కు గుడ్‌బై చెప్పి ఫిన్‌లాండ్‌లో అభివృద్ధి చేసిన ఓజోనేషన్ టెక్నాలజీని ఉపయోగిస్తున్నారు. అలాగే కర్ర నుంచి గుజ్జు (పల్ప్)ను వేరు చేసే ప్రక్రియ, గతంలో స్టోక్ కోల్ ఫైర్డ్ బాయిలర్ విధానంలో జరగగా.. ఇప్పుడు సర్క్యులేటెడ్ ఫ్లూయిడ్ బెడ్ కంబషన్ (సీఎఫ్‌బీసీ) విధానాన్ని ఉపయోగిస్తున్నారు. దీని వల్ల జల, వాయు కాలుష్యం గణనీయంగా అదుపు చేయగలిగారు. భారతీయ ప్రమాణాలకు మించి అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా వ్యర్థాల నిర్వహణ ఉందనేది కంపెనీ వర్గాల వాదనగా ఉంది.



ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కార్మికులు

టాప్‌టెన్‌లో చోటు

భద్రాచలం పేపర్ పరిశ్రమలో ఎనిమిదో యూనిట్ స్థాపించేందుకు దశాబ్దం కిందటే ప్రణాళిక రూపొందించారు. అయితే దీనికి అవసరమైన స్థల సేకరణ కష్టంగా మారింది. ప్లాంట్ల స్థాపన సమయంలోనే ప్రభుత్వం 507 ఎకరాలు అందజేసింది. ఇక మరోసారి అదనంగా భూసేకరణ కష్టమని తేల్చిచెప్పింది. దీంతో ప్లాంటు పనులు ముందుకు సాగలేదు. చివరకు ప్రస్తుత ప్లాంట్ ఆవరణలోని సిబ్బంది క్వార్టర్లను తొలగించి, అక్కడ ఎనిమిదో యూనిట్ నిర్మించాలని నిర్ణయించారు. ఈ ప్లాంట్‌కు ప్రాథమికంగా రూ.2,600 కోట్ల పెట్టుబడి పెట్టనున్నారు. ఆ తర్వాత దశల వారీగా ఈ మొత్తం రూ.4,000 కోట్ల వరకు చేరనుంది. కొత్తగా నిర్మించబోయే ప్లాంట్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 2.5 లక్షల టన్నులుగా నిర్దేశించారు. దీంతో ఐటీసీ భద్రాచలం కర్మాగారం వార్షిక ఉత్పత్తి సామర్థ్యం సాలీనా పది లక్షల టన్నులకు చేరుకోనుంది. ఇప్పటికే వర్జిన్ పేపర్ తయారీలో ఆసియాలోనే నంబర్ వన్ సంస్థగా ఉన్న ఈ ప్లాంట్ తాజా విస్తరణతో ప్రపంచ వ్యాప్తంగా టాప్‌టెన్ జాబితాలో చోటు దక్కించుకునే అవకాశం ఉంది.

గోదావరి వరదలపై నేడు సమీక్ష

- సమగ్ర సమాచారంతో భద్రాచలం రావాలి
- అధికారులకు కలెక్టర్ అనుదీప్ ఆదేశం

సూపర్‌బజార్(కొత్తగూడెం): గోదావరి వరదలపై మంగళవారం భద్రాచలం ఆర్డీఓ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నామని, అన్ని శాఖల అధికారులు సమగ్ర కార్యాచరణ నివేదికలతో హాజరు కావాలని కలెక్టర్ అనుదీప్ తెలిపారు. ఐడీఓసీ నుంచి సోమవారం అన్ని శాఖల అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలతో పలు అంశాలపై జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ముంపు ప్రాంతాల ప్రజలకు ఏర్పాటు చేసే పునరావాస కేంద్రాల జాబితా, ఏర్పాట్ల వివరాలతో హాజరు కావాలన్నారు. ఓటరు జాబితా రూపకల్పనలో భాగంగా పెండింగ్‌లో ఉన్న ఫారం 6, 7, 8 లను క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. జీఓ 58, 59 ప్రకారం సర్వే నిర్వహణకు నియమించిన ప్రత్యేక అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయిల్‌పామ్ సాగు లక్ష్యాన్ని సాధించేలా రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. ఇంటింటా ఇన్నోవేషన్ కార్యక్రమానికి ఆవిష్కర్తలు దరఖాస్తు చేసే విధంగా చైతన్యం చేయాలన్నారు. రైతులకు ఎరువులు, విత్తనాల కొరత లేకుండా చూడాలని వ్యవసాయాధికారులకు సూచించారు. గృహలక్ష్మి పథకం కింద ఇంటి స్థలం ఉన్న వారికి ఆర్థికసాయం అందించేందుకు సన్నద్ధంగా ఉండాలని చెప్పారు. జిల్లాలో 45 గ్రామపంచాయతీ భవనాల నిర్మాణానికి స్థల సేకరణ చేయాలని ఆదేశించారు. ఆ తర్వాత జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కె. వెంకటేశ్వర్లు, డీఎంహెచ్‌ఓ శిరీష, డీపీఓ రమాకాంత్, మహిళా సంక్షేమాధికారి సబిత తదితరులు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ అనుదీప్, పక్కన అదనపు కలెక్టర్

సమస్యలు సత్వరమే పరిష్కరించండి

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల ప్రజలు తమ సమస్యలపై ఇచ్చిన వినతులను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అనుదీప్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఆయన అదనపు కలెక్టర్ కె.వెంకటేశ్వర్లుతో కలిసి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పరిష్కారం కాకుంటే అదే విషయాన్ని ఫిర్యాదుదారులకు సమాచారం అందించాలన్నారు. కాగా, సోమవారం ప్రజావాణి కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చారు. దరఖాస్తుల్లో కొన్ని..

- బీటీపీఎస్ రైల్వేట్రాక్ ఏర్పాటులో తన ఇంటిని కోల్పోతున్నానని, తనకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ వర్తింపజేయాలని మణుగూరు మున్సిపాలిటీ బండారుగూడెం గ్రామానికి చెందిన రాములూరి లక్ష్మి వినతిపత్రం అందించగా భూసేకరణ విభాగం అధికారికి ఎండార్స్ చేశారు.
- బూర్గంపాడు మండలం రాజీవ్‌నగర్‌కు చెందిన బి.సంతోష్ తన తండ్రి అనారోగ్యంతో మరణించాడని, ఆయన పేరున ఉన్న భూమిని తన పేరు మీదకు మార్చాలని చేసిన దరఖాస్తును ఆర్ఓఎఫ్ఆర్ డీటీకి ఎండార్స్ చేశారు.

'భోజనానికి' సమ్మె పోటు

మిడ్డే మీల్స్ వర్కర్లు సమ్మె బాట పట్టడంతో ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం నుంచి మధ్యాహ్న భోజన పథకానికి బ్రేక్ పడింది. దీంతో విద్యార్థులకు ఉపాధ్యాయులు ముందుగానే సమాచారం అందించడంతో పిల్లలు ఇంటి నుంచే టిఫిన్ బాక్స్‌లు తెచ్చుకుని స్కూళ్లలో మధ్యాహ్న భోజనం చేశారు.

– కొత్తగూడెంఅర్బన్



బూడిదగడ్డ ప్రభుత్వ పాఠశాలలో ఇంటి నుంచి తెచ్చుకున్న బాక్సుల్లో భోజనం చేస్తున్న విద్యార్థులు

పది కిలోమీటర్ల పాదయాత్ర

కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీ టీచర్ల ధర్నా

సూపర్‌బజార్(కొత్తగూడెం): తమ సమస్యలు పరిష్కరించాలంటూ అంగన్‌వాడీ టీచర్లు సోమవారం పాల్వంచ తహసీల్దార్ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు సుమారు 10 కి.మీ. నల్లచీరలు ధరించి, ఎర్రజెండాలు పట్టుకుని పాదయాత్ర నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ చట్టాన్ని అమలు చేయాలని, టీచర్‌కు రూ. 5లక్షలు, మినీ టీచర్లు, హెల్పర్‌కు రూ. 4 లక్షలకు తక్కువ కాకుండా ఉద్యోగ విరమణ బెనిఫిట్స్ కల్పించాలని కోరారు. చివరి నెల జీతంలో సగం పెన్షన్‌గా ఇవ్వాలని, నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని, ఐసీడీఎస్‌కు బడ్జెట్ పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.జె. రమేష్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ టీచర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, రూ. 26 వేలు కనీస వేతనం ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జి. పద్మ మాట్లాడుతూ ఆరోగ్యలక్ష్మి, ఇంటిఅద్దె బిల్లులు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. బీఎల్‌ఓ విధులు నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లను తహసీల్దార్లు మానసికంగా వేధిస్తున్నారని ఆరోపించారు. అనంతరం కలెక్టర్ వద్దకు ప్రతినిధి బృందం వెళ్లగా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె. బ్రహ్మాచారి, యూనియన్ జిల్లా అధ్యక్షురాలు వెంకటమ్మ, నాయకులు వెంకటరమణ, రాధాకుమారి, సావిత్రి, జయశీల, వీరభద్రమ్మ, సారమ్మ, రాధ, సూరమ్మ, మరియ, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.



పాదయాత్ర నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

ప్రతిభకు పదునుపెట్టేలా..

- ఇన్‌స్పైర్ మనాక్‌లో ఆవిష్కరణలకు అవకాశం
- ఆగస్టు 31 వరకు అప్‌లోడింగ్‌కు గడువు
- ఉత్తమ విద్యార్థులకు ప్రోత్సాహకాలు
- ఇక అన్ని వర్గాలకు 'ఇంటింటా ఇన్నోవేషన్'

కొత్తగూడెంఅర్బన్: విద్యార్థుల ఆలోచనలకు పదును పెట్టి, వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసి బావిభారత శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకు నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్, కేంద్ర శాస్త్ర సాంకేతిక మండలి సంయుక్త ఆధ్వర్యంలో ప్రతి ఏడాది ఇన్‌స్పైర్ మనాక్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తున్నాయి. వినూత్నంగా తయారు చేసిన, సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలతో ఎక్కువ మందికి లబ్ధి చేకూరే వాటికి ప్రాధాన్యత కల్పిస్తూ రూపొందించిన విద్యార్థులను ప్రోత్సహిస్తూ నగదు బహుమతులు అందజేస్తున్నారు. ఇన్‌స్పైర్ మనాక్‌కు సంబంధించి జిల్లాలోని 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు నూతన ఆవిష్కరణలు రూపొందించిన ప్రాజెక్టుల ఫొటోలు, వీడియో తదితర వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. ఇందుకు ఆగస్టు 31 వరకు అవకాశం ఉంది. అయితే ఒక్క స్కూల్ నుంచి ఐదు ప్రాజెక్టుల వరకే అవకాశం కల్పించారు. జిల్లా స్థాయిలో ఎంపికైన ప్రాజెక్టుకు ప్రోత్సాహకంగా రూ.10 వేల నగదు బహుమతి, రాష్ట్ర స్థాయికి రూ.25 వేలు, జాతీయ స్థాయికి ఎంపికైతే రూ.50 వేల బహుమతులు అందజేస్తున్నారు. 2021లో జిల్లా నుంచి జాతీయ స్థాయిలో అశ్వారావుపేట జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థి ప్రాజెక్టు ఎంపికైంది. ఈ ఏడాది కూడా పాఠశాలలోని విద్యార్థుల ఆలోచనలకు మరింతగా పదును పెట్టి జాతీయస్థాయిలో విజయం సాధించేలా ఇప్పటికే సైన్స్, గణిత ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ప్రాజెక్టులు ఎలా రూపొందించాలి, ఎలా అప్‌లోడ్ చేయాలనే విషయాలపై జిల్లా సైన్స్ అధికారులు సలహాలు, సూచనలు అందజేశారు.






గత ఏడాది ఇంటింటా ఇన్నోవేషన్‌లో జిల్లా స్థాయిలో ఎంపికైన ఆవిష్కరణలు

ఇంటింటా ఇన్నోవేటర్ ..

స్థానిక సమస్యల పరిష్కారంతో పాటు నూతన ఆవిష్కరణలకు అవకాశం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. పాఠశాల, కళాశాల విద్యార్థులతో పాటు నూతన ఆవిష్కరణల పట్ల మక్కువ ఉన్న రైతులు, వ్యాపారులు, ఉద్యోగులు, మహిళలు భాగస్వాములయ్యేలా అవకాశం కల్పించింది. కొత్త ఆలోచనలతో చేసిన వీడియోలు, ఫొటోలు, ఇన్నోవేషన్ పేరు, చేసిన వారి పేర్లను 9100678543 నంబర్‌కు వాట్సాప్ చేయాలని ప్రభుత్వం సూచించింది. ఇవి ఆగస్టు 5లోగా పంపించాల్సి ఉంటుంది. వీడియోలు రెండు నిమిషాల నిడివికి మించరాదు. ఇందులో ఉత్తమ ఇన్నోవేషన్లను ఎంపిక చేసి స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రదర్శిస్తారు. ప్రాజెక్టులు రూపొందించిన వారికి తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ ఆధ్వర్యంలో సర్టిఫికెట్, పేటెంట్ హక్కుల ప్రశంసపత్రాలు అందజేస్తారు. ఇన్‌స్పైర్ మనాక్‌కు సంబంధించి 2022లో జిల్లాకు 389 దరఖాస్తులు రాగా, వీటిలో 86 ప్రాజెక్టులు, ఖమ్మం జిల్లాలో 487 దరఖాస్తులు రాగా 79 ఎంపికయ్యాయి. ఆయా విద్యార్థులకు రూ.10 వేల చొప్పున నగదు బహుమతి అందజేయనున్నారు. ఇంటింటా ఇన్నోవేషన్‌లో గతేడాది జిల్లా నుంచి 67 దరఖాస్తులు రాగా, 7 ప్రాజెక్టులు జిల్లా స్థాయిలో ఎంపికయ్యాయి. రాష్ట్ర స్థాయిలో ఎంపికైనా ప్రాజెక్టుకు రూ.లక్ష బహుమతి అందజేయనున్నారు.


ఐఐటీలో రెండు శాతం రిజర్వేషన్..



ఇన్‌స్పైర్ మనాక్‌లో విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులు ఆగస్టు 31 వరకు అప్‌లోడ్ చేసే అవకాశం ఉంది. రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఎంపికైన విద్యార్థులకు ఐఐటీలో రెండు శాతం రిజర్వేషన్ సౌకర్యం ఉంటుంది. పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించి సలహాలు, సూచనలు చేయాలి.

– ఎస్.చలపతిరాజు, జిల్లా సైన్స్ అధికారి

విద్యార్థులకు మంచి అవకాశం



విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసి, బావి భారత శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఇన్‌స్పైర్ మనాక్ మంచి అవకాశం. జిల్లా నుంచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యేలా ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించాలి. ఇంటింటా ఇన్నోవేషన్‌లో అందరూ పాల్గొనవచ్చు. వారి ప్రాజెక్టులను ఆగస్టు 5 లోగా అప్‌లోడ్ చేయాలి.

– ఇ.సోమశేఖరశర్మ, డీఈఓ

భావి శాస్త్రవేత్తలుగా తయారుచేయండి

భద్రాచలంటౌన్: విద్యార్థులు తరగతి గదికే పరిమితం కాకుండా, వారిని భావి శాస్త్రవేత్తలుగా తయారు చేయాలని జిల్లా సైన్స్ అధికారి ఎస్.చలపతి రాజు ఉపాధ్యాయులకు సూచించారు. స్థానిక సెయింట్ పాల్స్ లూథరన్ హై స్కూల్‌లో సోమవారం జిల్లా స్థాయి సైన్స్, గణితం ఇన్‌స్పైర్, ఇంటింటా ఇన్నోవేషన్‌పై ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రతి ఉన్నత పాఠశాలలో 6 నుంచి 10 తరగతుల విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్టులను ఇన్‌స్పైర్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. జిల్లా స్థాయిలో ఎంపికైన విద్యార్థికి రూ.10 వేల బహుమతి ఉంటుందన్నారు. అనంతరం నేషనల్ చిల్డ్రన్ సైన్స్ కాంగ్రెస్‌లో జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రాజెక్టుగా ఎంపికైన విద్యార్థి కిషన్ ఆదర్శ్‌కు ప్రశంసపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ సున్నం సమ్మయ్య, ప్రిన్సిపాల్ అబ్రహం, సంపత్‌కుమార్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధంగా 'సీమాంక్'

- ప్రత్యేక వసతులతో ప్రసూతి వార్డు నిర్మాణం
- రూ.1.80 కోట్ల వ్యయంతో పనులు
- ప్రత్యేక చొరవ చూపించిన కలెక్టర్

చర్ల: ఏజెన్సీ మండలాల గర్భిణులకు పూర్తిస్థాయిలో వైద్య సేవలందించేందుకు ఈ ప్రాంతానికి కూడలిగా ఉన్న చర్లలో సీమాంక్ సెంటర్ (ప్రసూతి, నవజాత శిశు సంరక్షణ కేంద్రం) నిర్మాణానికి కలెక్టర్ అనుదీప్ విశేష కృషి చేశారు. తన నిధుల నుంచి రూ 1.40 కోట్లు కేటాయించి 30 పడకలతో మెటర్నిటీ వార్డు, గర్భిణులు వేచి ఉండే గదులు, పడకల ఏర్పాటుతో పాటు వారికి సహాయకులుగా వచ్చే వారి కోసం వసతి సౌకర్యాలు కల్పించారు. కలెక్టర్ నిధులతో పాటు ప్రభుత్వ విప్ రేగా కాంతారావు చొరవతో రాజ్యసభ సభ్యులు బండి పార్థసారధిరెడ్డి రూ.35 లక్షలు మంజూరు చేయగా, ఆ తర్వాత కలెక్టర్ మరో రూ.5 లక్షలు విడుదల చేశారు. మొత్తంగా రూ 1.80 కోట్లతో వైద్యశాల అభివృద్ధి పనులు ప్రారంభించి పర్యవేక్షణ బాధ్యతలను డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రవిబాబుకు అప్పగించారు. ఆరు నెలల్లోనే నిర్మాణ పనులు పూర్తి కాగా, త్వరలోనే ఈ సెంటర్‌ను ప్రారంభించనున్నారు. రూ. 1.30 కోట్లతో మెటర్నిటీ వార్డు నిర్మించి అందులో సౌకర్యాలను ఏర్పాటు చేయగా, రూ.15 లక్షలతో ఆపరేషన్ థియేటర్, మరో రూ.15 లక్షలతో ల్యాబ్, రూ.5లక్షలతో ఇతర మరమ్మతు పనులు చేపట్టారు. ఇక చర్లలో పోస్ట్‌మార్టం చేసేందుకు మార్చురీ గది లేకపోవడంతో రూ.15 లక్షలతో దాన్ని కూడా నిర్మించారు. ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న వైద్యశాలల్లో సరైన వైద్యులు, సౌకర్యాలు లేక ప్రసవాల కోసం మహిళలు తీవ్ర ఇబ్బందులు పడగా, పేద, మధ్య తరగతి కుటుంబాల వారు ఆర్థికంగా ఎంతగానో నష్టపోయారు. ఇవన్నీ గుర్తించిన కలెక్టర్.. చర్లలోని సీమాంక్ సెంటర్ ఆధునికీకరణ, ప్రత్యేక సౌకర్యాలతో అదనంగా ప్రసూతి వార్డు నిర్మాణానికి కృషి చేశారు. ఇక ఈ సెంటర్ ప్రారంభం కాగానే నిపుణులైన గైనకాలజిస్ట్, అనస్థీషియా, పిల్లల వైద్య నిపుణుల నియామకానికి జిల్లా మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్ రావుతో కలెక్టర్ సంప్రదింపులు జరుపుతున్నారు.



అధునాతన సౌకర్యాలతో నిర్మించిన మెటర్నిటీ వార్డు



వార్డులో ఏర్పాటు చేసిన పడకలు

క్లుప్తంగా

'సింగరేణి' పిల్లలకు మెరిట్ ప్రకారమే మెడికల్ సీట్లు

సింగరేణి(కొత్తగూడెం): పెద్దపల్లి జిల్లా రామగుండంలో కొత్తగా ఏర్పాటుచేసిన మెడికల్ కాలేజీ(సింగరేణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్)లో సింగరేణి అధికారులు, ఉద్యోగుల పిల్లలకు నీట్‌లో సాధించిన ర్యాంక్ ఆధారంగా సీట్లు కేటాయించనున్నట్లు డైరెక్టర్(పా) ఎన్.బలరామ్ ఒక ప్రకటనలో తెలిపారు. మెడికల్ కళాశాలలో సింగరేణీయుల పిల్లలకు 5 శాతం అంటే ఏడు సీట్లు కేటాయించారని, అర్హులు ఈనెల 14లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఉత్తమ ర్యాంక్‌తో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను వర్తింపజేస్తూ కాళోజీ నారాయణరావు యూని వర్సిటీ ఆఫ్ మెడికల్ సైన్సెస్ వారు సీట్లు కేటాయిస్తారని వివరించారు. దరఖాస్తుదారుల తల్లి లేదా తండ్రి పనిచేసే గని విభాగాధిపతి నుంచి సంబంధిత ధ్రువీకరణ పత్రం సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

జాబ్ మేళాకు స్పందన


జాబ్ మేళాకు హాజరైన అభ్యర్థులు

పాల్వంచ: పట్టణంలోని అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. సుమారు 500 మంది అభ్యర్థులు హాజరయ్యారు. సాఫ్ట్‌వేర్ కంపెనీలు, బ్యాంకింగ్ సంస్థలు పాల్గొని పరీక్షలు నిర్వహించి 150 మందిని ఎంపిక చేశాయి. వీరికి త్వరలోనే ఇంటర్వ్యూ నిర్వహించనున్నారు. అర్హత సాధించే విద్యార్థులకు రూ.3 లక్షల నుంచి రూ.8లక్షల వరకు వార్షిక వేతనాలు ఉంటాయని కళాశాల చైర్మన్ భరత్‌కృష్ణ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ.సుబ్బారావు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఇమ్మడి క్రాంతి కుమార్, డైరెక్టర్ టి.అవని, వైస్ ప్రిన్సిపాల్ జి.వెంకన్న పాల్గొన్నారు.

ఇసుక లారీ పట్టివేత

పాల్వంచరూరల్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఓ ప్రజాప్రతినిధికి చెందిన లారీని ఆదివారం రాత్రి రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. తహసీల్దార్ రంగాప్రసాద్ కథనం ప్రకారం... మండల పరిధిలోని రంగాపురం గ్రామానికి ప్రజాప్రతినిధికి చెందిన లారీలో కిన్నెరసాని వాగు నుంచి అక్రమంగా పాల్వంచ పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. పక్కా సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు నిఘా పెటి లారీని పట్టుకుని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

కామేపల్లి(కారేపల్లి): ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో ఓ మహిళ మృతి చెందిన ఘటన కామేపల్లి మండలం బర్లగూడెంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మూడ్ సంగీత(28) ఇంట్లో పనులు చేస్తున్న క్రమంలో రేకులకు చేయి తగిలింది. అప్పటికే రేకులకు కరెంట్ ప్రసరణ కావటంతో సంగీత షాక్‌కు గురై మృతి చెందింది. ఆమెకు భర్త మూడ్ చిన్న, ఒక కుమార్తె ఉంది.


సంగీత (ఫైల్)

చికిత్స పొందుతున్న వ్యక్తి..

ఇల్లెందు: ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతున్న వ్యక్తి సోమవారం తెల్ల వారుజామున మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని ఇందిరా నగర్‌కు చెందిన ఇమ్రాన్(22) పంక్చర్ షాపులో ఈ నెల 1న గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలకు, అక్కడి నుంచి ఖమ్మానికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుడి తల్లి హలీమా ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ తుల్సిరాం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మద్యం మత్తులో యువకుల వీరంగం

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని ఓ వైన్స్ వద్ద ఇరు వర్గాలుగా విడిపోయిన యువకులు గొడవకు దిగడంతో రణరంగంగా మారింది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన ఇద్దరేసి యువకులు ఆదివారం రాత్రి వైన్స్ వద్దకు వేర్వేరుగా వచ్చారు. మద్యం తాగుతుండగా ఓ పంచాయితీపై మొదలైన చర్చ గొడవకు దారి తీసింది. దీంతో తోపులాటలు, అరుపులు, కేకలతో నేలకొండపల్లి–కూసుమంచి రహదారిపైకి చేరుకున్నారు. అక్కడ ఉన్న బీరు బాటిళ్లు పగలగొట్టుకుని దాడులకు యత్నించగా స్థానికులు సర్దిచెప్పిపంపించారు. ఈ ఘటనపై ఆదాం సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రూ.15 లక్షలకు ఐపీ..

ఖమ్మం లీగల్: ఖమ్మంకు షేక్ నాగూర్ షరీఫ్ సోమవారం రూ.15 లక్షలకు దివాళా పిటీషన్ (ఐపీ) దాఖలు చేశాడు. హోటల్ వ్యాపారం చేసిన ఆయన పలువురి అప్పులు చేశాడు. ప్రస్తుతం అవి తీర్చే మార్గం లేదంటూ ఇద్దరిని ప్రతివాదులుగా చేరుస్తూ తన న్యాయవాది ద్వారా సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో దివాళా పిటిషన్ దాఖలు చేశాడు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,623

టెండర్లు చేపడుతున్నారు..

- వచ్చే నెల మొదటి వారంలో చేప పిల్లల పంపిణీ
- 734 చెరువుల్లో పోసేందుకు సిద్ధమవుతున్న మత్స్యశాఖ
- బొచ్చె, శీలావతి, బంగారు తీగ తదితర రకాలు..
- పది వేల మందికి ప్రయోజనం కలిగే అవకాశం



చెరువులో చేప పిల్లలను వదులుతున్న సిబ్బంది (ఫైల్), (ఇన్‌సెట్) చేపపిల్లలు

పాల్వంచరూరల్ : వచ్చే నెలలో ఉచితంగా చేప పిల్లల పంపిణీకి మత్స్యశాఖ అధికారులు సిద్ధమవుతున్నారు. జిల్లాలోని జలాశయాలు, చెరువులు, కుంటలు నిండేనాటికి చేప పిల్లలను అందుబాటులోకి తేవాలని భావిస్తున్నారు. సీడ్ కోసం ఇప్పటికే రెండు దఫాలుగా టెండర్లు పిలిచారు. జిల్లాలోని తాలిపేరు, అశ్వారావుపేట మండలంలోని పెద వాగు జలాశయాలతోపాటు శ్వాశతంగా నీరు నిలిచే 73 చెరువులు, స్వల్పకాలికంగా నీరు ఉండే 661 చెరువులు.. మొత్తం 734 చెరువులు చేపల పెంపకానికి అనువుగా ఉన్నట్లు మత్స్యశాఖ గుర్తించింది. చేపపిల్లలను ప్రభుత్వం వందశాతం రాయితీపై అందిస్తున్న విషయం విదితమే. ఈ యేడాది సుమారు రూ.1.18 కోట్ల విలువైన 1.77 కోట్ల చేప పిల్లలను పంపిణీ చేసేందుకు మత్స్యశాఖ సన్నద్ధమైంది. జిల్లా వ్యాప్తంగా మత్స్యశాఖ గుర్తించిన చెరువుల్లో బొచ్చె, బంగారుతీగ వంటి రకాల చేప పిల్లలను పోయనున్నారు. 80 నుంచి 90 మిల్లీమీటర్ల సైజు కలిగిన చేపపిల్లలను జలాశయాల్లో, 35 నుంచి 40 మిల్లీమీటర్ల సైజు కలిగిన చేపపిల్లలను చెరువుల్లో పోసి పెంచనున్నారు.

పదివేల మందికి లబ్ధి

ఉచితంగా చేప పిల్లలను పంపిణీ ద్వారా 10 వేల మందికి ప్రయోజనం కలుగుతుందని మత్స్యశాఖ అధికారులు చెబుతున్నారు. జిల్లాలో మొత్తం 49 మత్స్యపారిశ్రామిక సొసైటీలు ఉండగా, ఇందులో 2,476 మంది సభ్యులు ఉన్నారు. సొసైటీలు లేని గ్రామాల్లో మత్స్యశాఖ ఆధ్వర్యంలోనే చెరువుల్లో చేప పిల్లలను పోసి పెంచుతారు. గతంలో గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో చేపపిల్లలను పంపిణీ చేస్తే, చేపలు పెరిగాక పంచాయతీలకు ఆదాయం వచ్చేది. గతేడాది నుంచి గ్రామపంచాయతీ చెరువులను కూడా మత్స్యశాఖకు స్వాధీనంచేశారు. దీంతో పంచాయతీ పరిధిలోని చెరువుల్లో కూడా ఈ ఏడాది నుంచి మత్స్యశాఖ ద్వారానే చేప పిల్లలను పోసి పెంపకం చేపడతారు. దీంతో ఆదాయం పంచాయతీలకు కాకుండా మత్స్యశాఖ ఖజానాకు చేరనుంది. కాగా 2022–2023 సంవత్సరంలో జిల్లాలో రూ.కోటి 61 లక్షల 9వేల విలువైన కోటి 77 లక్షల 42 వేల చేపపిల్లలను 743 చెరువుల్లో వదిలారు. 9,800 మెట్రిక్ టన్నుల మత్స్య దిగుబడి లభించగా, సుమారు పదివేల కుటుంబాలకు ప్రయోజనం కలిగింది.

ఫీడింగ్ సౌకర్యం కూడా కల్పించాలి

గతంలో పంచాయతీల చెరువుల్లో పోసిన చేప పిల్లలు ఆశించిన సైజులో ఎదగలేదు. దీంతో మత్స్య సొసైటీలు, పంచాయతీలకు దిగుబడిరాక నష్టపోయారు. ఇందుకు ప్రధాన కారణం చెరువుల్లో పోసిన చేపపిల్లలకు సరైన ఆహారం లేకపోవడమేనని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం చేప పిల్లలను ఉచితంగా ఇస్తున్నా మేత కూడా సబ్సిడీ రూపంలో లేదా ఉచితంగా ఇవ్వాలని కోరుతున్నారు. అప్పుడే చేప పిల్లలు ఆశించిన సైజు పెరిగి అధిక దిగుబడి వస్తుందని మత్స్యపారిశ్రామిక సొసైటీల సభ్యులు పేర్కొంటున్నారు.

చేపపిల్లల పంపిణీ ప్రతిపాదనల వివరాలు

నియోజకవర్గం	చెరువులు	చేపపిల్లలు (లక్షల్లో)
కొత్తగూడెం	52	19.65
భద్రాచలం	216	37.67
ఇల్లెందు	103	20.08
అశ్వారావుపేట	134	49.28
పినపాక	150	46.74
జూలూరుపాడు (వైరా)	10	3.26

ఆగస్టు నుంచి పంపిణీ చేస్తాం



చేప పిల్లల పంపిణీ చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నాం. జిల్లాలో ఆగస్టు నెల నుంచి నిర్దేశించిన 734 చెరువుల్లో 1.77లక్షల చేప పిల్లలను వదులుతాం. వర్షాకాలంలో చేప పిల్లలను చెరువుల్లో పోసిన తర్వాత చెరువులు అలుగు పోస్తే చేప పిల్లలు బయటకు వెళ్లిపోయే అవకాశం ఉంది. మత్స్యపారిశ్రామిక సొసైటీల సభ్యులు అలుగుల వద్ద వలలను ఏర్పాటు చేసుకోవాలి.

– వీరన్న, జిల్లా మత్స్యశాఖాధికారి

భారీగా గంజాయి స్వాధీనం


టేకులపల్లి: వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రమణమూర్తి తదితరులు

సినీ ఫక్కీలో చేజింగ్‌లు

- టేకులపల్లిలో 232 కేజీలు పట్టివేత
- కొత్తగూడెంలో రెండు ఘటనల్లో 60, సారపాకలో 14 కేజీలు..
- తొమ్మిది మంది నిందితుల అరెస్ట్

టేకులపల్లి: జిల్లాలో సోమవారం భారీగా గంజాయి పట్టుబడింది. నాలుగు చోట్ల సుమారు 306 కేజీలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 9 మంది నిందితులను అరెస్ట్ చేశారు.

టేకులపల్లిలో 232 కేజీలు..

ఇల్లెందు డీఎస్పీ రమణమూర్తి కథనం ప్రకారం.. నిజామాబాద్ జిల్లా ఏరుగట్ల గ్రామానికి చెందిన నానబాల సురేష్ హైదరాబాద్ ఘట్‌కేసర్‌లో విద్యాభ్యాసం చేస్తున్నాడు. జల్సాలకు అలవాటు పడ్డ అతను చార్మినార్‌కు చెందిన తన మిత్రుడు సంతోష్‌ను డబ్బులు అడిగాడు. దీంతో గంజాయి తెచ్చి రూ.లక్ష ఇస్తానని సంతోష్ ఆశ చూపగా, ఒప్పుకున్నాడు. ఆన్‌లైన్ యాప్‌లో సెల్ఫ్ డ్రైవింగ్ కారు బుక్ చేసుకుని ఈ నెల 9న రాత్రి స్వయంగా డ్రైవింగ్ చేసుకుంటూ ఏపీలోని సీలేరు వెళ్లాడు. అక్కడ మణికంఠ అనే వ్యక్తి వద్ద 104 ప్యాకెట్లలో 232 కేజీల గంజాయి తీసుకుని సోమవారం ఉదయం బయలుదేరాడు. సమాచారం అందడంతో టేకులపల్లిలో పోలీసులు నిఘా పెట్టారు. వాహన తనిఖీలు చేస్తుండగా గమనించిన సురేష్ అతివేగంతో ఆపకుండా వెళ్లిపోయాడు. వెంకట్యాతండా వద్ద ఆటో ఢీకొట్టాడు. ఆ తర్వాత కొంత దూరంలో ఓ బైక్‌ను ఢీకొట్టి అదే వేగంతో వెళ్తున్నాడు. దీంతో బైక్ మీద వస్తున్న యువకుడు అరుస్తూ కారును వెంబడించాడు. నర్సాయిగూడెం క్రాస్‌రోడ్డు దాటగానే అతి వేగం కారణంగా కారు అదుపు తప్పి రోడ్డు పక్కన పొలంలోకి దూసుకెళ్లింది. చేను దున్నుతున్న అరకను ఢీకొట్టి ఆగిపోయింది. అక్కడి నుంచి సురేష్ పారిపోతుండగా ఈ లోపు చేరుకున్న పోలీసులు స్థానికుల సాయంతో పట్టుకున్నారు. అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. గంజాయిని, కారును స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న గంజాయి విలువ సుమారు రూ. 46 లక్షలు ఉంటుందని, కేసు దర్యాప్తు చేపట్టామని డీఎస్పీ తెలిపారు. సీఐ ఇంద్రసేనారెడ్డి పాల్గొన్నారు.


టేకులపల్లి: స్థానికుల సాయంతో నిందితుడిని పట్టుకున్న పోలీసులు

మూడు బైక్‌లు దొంగిలించి..

కొత్తగూడెంరూరల్: అక్రమంగా తరలిస్తున్న 46.4 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకుని ఐదుగురిపై కేసు నమోదు చేశారు. లక్ష్మీదేవిపల్లి పోలీసుల కథనం ప్రకారం... ఇల్లెందు క్రాస్ రోడ్‌లోని వనవిహార్ ముందు పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో ముగ్గురు వ్యక్తులు బైక్‌పై అనుమానాస్పదంగా వస్తుండగా ఆపి తనిఖీ చేశారు. వారి నుంచి రూ. 9,28,000 విలువైన 46.4 గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అదుపులోకి తీసుకుని విచారించగా.. చెన్నైకి రాజశేఖరన్ విగ్నేశ్వరన్, మాయావన్ వెంకటేష్, హైదరాబాదుకు చెందిన రోషన్ కుమార్‌సింగ్, నర్రా మహేష్, పోసోని అభిషేక్ వరంగల్‌లో రెండు బైక్‌లను, పాల్వంచ అనుబోస్ ఇంజనీరింగ్ కాలేజ్ వద్ద మరో బైక్‌ను దొంగిలించారు. రెండు బైక్‌లను ఒడిశాలోని కెలిమెల ప్రాంతంలో తాకట్టు పెట్టి వచ్చిన డబ్బుతో గంజాయి కొనుగోలు చేశారు. ముగ్గురు బైక్‌పై, మరో ఇద్దరు ఆటోలో వస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. నాలుగు సెల్ ఫోన్లు, బైకు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి ఐదుగురిని రిమాండ్ తరలించారు. వీరిపై పలు పోలీస్ స్టేషన్లలో కేసులు ఉన్నట్లు ఎస్ఐ ప్రవీణ్ తెలిపారు.

సారపాకలో 14 కేజీలు..

బూర్గంపాడు: సారపాకలో సోమవారం రాత్రి పోలీసులు 14 కేజీల గంజాయిని పట్టుకున్నారు. వాహనాల తనిఖీ చేస్తున్న క్రమంలో బైక్‌పై వస్తున్న ఇద్దరు వ్యక్తులను అనుమానంతో ఆపగా, బ్యాగ్ పడేసి పరారయ్యారు. బ్యాగులో 14 కేజీల గంజాయి లభించిందని, నిందితుల కోసం గాలింపు చేపట్టామని ఎస్ఐ సంతోష్ తెలిపారు.

ఎక్సైజ్ అధికారుల నుంచి తప్పించుకుని..

కొత్తగూడెంఅర్బన్: సినీఫక్కీలో తప్పించుకుపోతున్న గంజాయి రవాణాదారులను సోమవారం పోలీస్, ఎక్సైజ్ శాఖల అధికారులు అరెస్ట్ చేశారు. కొత్తగూడెం ఎక్సైజ్ సీఐ ఎల్.జయశ్రీ కథనం ప్రకారం.. గంజాయి రవాణా చేస్తున్నారనే సమాచారంతో ఇల్లెందు క్రాస్ రోడ్డులో సోమవారం ఎక్సైజ్ స్పెషల్ టాస్క్ ఫోర్స్, జిల్లా టాస్క్‌ఫోర్స్, కొత్తగూడెం ఎక్సైజ్ సీఐ, సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో మిర్యాలగూడేనికి చెందిన రాంరాకేష్, జి.వసంత్, రంగారెడ్డి జిల్లా బాల్‌రెడ్డి నగర్‌కు చెందిన లావుడ్యా సాయి కారులో ఏపీలోని చింతూరు నుంచి 13.5 కేజీల ఎండు గంజాయి తీసుకెళ్తున్నారు. గంజాయి కనిపించకుండా కారు డోర్‌లో ఫిక్స్ చేశారు. ముందే సమాచారం ఉన్న అధికారులు ఇల్లెందు క్రాస్ రోడ్డులో నిఘా పెట్టారు. గమనించిన నిందితులు అతివేగంతో ఎక్సైజ్ అధికారులను తప్పించుకుని కొత్తగూడెం పట్టణం మీదుగా వెళ్తున్నారు. ఈక్రమంలో ఎక్సైజ్ అధికారుల సమాచారంతో సుజాతనగర్ పోలీసులు అప్రమత్తమై రహదారిపై పోలీసులు వాహనం అడ్డంగా పెట్టారు. అయినా నిందితులు కారుతో పోలీస్ వాహనాన్ని ఢీకొట్టారు. అనంతరం మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి కారు నిలిచిపోయింది. దీంతో పోలీసులు కారును, 13.5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని, ముగ్గురు నిందితులను పట్టుకుని ఎక్సైజ్ అధికారులకు అప్పగించారు. 2.7 లక్షల ఉంటుందని అంచనా. ఎక్సైజ్ అధికారులు నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. పట్టుబడ్డ నిందితుల్లో ఒకరు బీటెక్, మరొకరు డిగ్రీ చదువుతుండగా, ఇంకొకరు షాపు నడుపుతున్నారు. వీరు వ్యసనాలకు అలవాటుపడి గంజాయి తీసుకెళ్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్టీఎఫ్‌డీ టీం, డీటీఎఫ్ టీం సభ్యులు, కొత్తగూడెం ఎక్సైజ్ అధికారులు, సుజాతనగర్ పోలీసులు పాల్గొన్నారు.


నిందితులను చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

ఉద్రిక్తతకు దారితీసిన కార్మికుల సమ్మె

- ప్రత్యామ్నాయ ఏర్పాట్లను నిరసించిన వర్కర్లు
- ఎంపీఓ దురుసుగా ప్రవర్తించడంపై కార్మికుల ధర్నా


ఇల్లెందు రూరల్ : కార్మిక సంఘాల నాయకులతో ఎంపీఓ చిరంజీవి వాగ్వాదం


టేకులపల్లి : ఇతరులతో పనులను చేయించొద్దని బైఠాయించిన నాయకులు, కార్మికులు

ఇల్లెందురూరల్: సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో గ్రామపంచాయతీ వర్కర్లు చేస్తున్న నిరవధిక సమ్మె సోమవారం ఐదో రోజుకు చేరుకుంది. ఈమేరకు ఇల్లెందు మండలంలోని పలుగ్రామాల్లో సోమవారం పర్యటించిన ఎంపీఓ చిరంజీవి చెత్త సేకరణకు ట్రాక్టర్లను బయటకు తీయాలని సర్పంచ్‌లు, కార్యదర్శులపై ఒత్తిడి తెచ్చారు. దీంతో సుభాష్‌నగర్ గ్రామపంచాయతీలో కార్మికులు ధర్నా చేశారు. దీంతో ఆగ్రహించిన ఎంపీఓ వారితో దురుసుగా వ్యవహరించగా ట్రాక్టర్‌ను అడ్డుకున్నారు. ఆ తర్వాత కార్మిక సంఘాల నాయకులు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీఓకు వినతిపత్రం ఇచ్చే క్రమంలోనూ వాగ్వాదం జరగగా అక్కడ కూడా ధర్నా చేశారు. చివరకు ఎంపీఓ చిరంజీవి తన ప్రవర్తనపై క్షమాపణ కోరడంతో కార్మికులు శాంతించారు. అనంతరం దీక్ష శిబిరంలో ఎన్‌డీ నాయకుడు ఆవునూరి మధు, కార్మిక సంఘాల నాయకులు తోడేటి నాగేశ్వరరావు, యాకూబ్ షావలీ, రమేష్ మాట్లాడుతూ కార్మికుల సమ్మెను విచ్ఛిన్నం చేసే యత్నాలను ప్రభుత్వం విరమించుకుని సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నాయకులు జటంగి వెంకన్న, కొక్కు సారంగపాణి, కిరణ్, గోపి, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లను అడ్డుకున్న కార్మికులు

టేకులపల్లి: గ్రామపంచాయతీ కార్మికుల సమ్మెతో గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేయడంతో అధికారులు సోమవారం ఇతర కార్మికులను పిలిపించి పనులు చేయించారు. ఈ విషయం తెలుసుకున్న జీపీ కార్మిక సంఘాల జేఏసీ నాయకులు, కార్మికులు టేకులపల్లి రామాలయం సెంటర్ వద్ద ట్రాక్టర్‌ను అడ్డుకున్నారు. సమస్యలు పరిష్కరించాల్సింది పోయి ఇతరులతో పని చేయించడం సరికాదన్నారు. జేఏసీ, కార్మిక సంఘాల నాయకులు మాలోతు సతీష్, ఎస్.నాగేశ్వర్‌రావు, మూడు బిచ్చు, రాంబాబు, ప్రవీణ్, ఎర్రయ్య, వెంకటేశ్వర్లు, మహేష్, వీరన్న తదితరులు పాల్గొన్నారు. కాగా, కార్మిక సమ్మె శిబిరాన్ని కాంగ్రెస్ నాయకుడు భూక్యా దళ్‌సింగ్ నాయక్ తదితరులు సందర్శించి సంఘీభావం తెలపగా జేఏసీ నాయకులు ఎంపీఓ గణేష్‌గాంధీకి వినతిపత్రం అందజేశారు. నాయకులు మాలోతు సతీష్, దుబాకుల ప్రసాద్, మూడు బిచ్చు, సరికొండ నాగేశ్వర్‌రావు, మహేష్, వీరన్న, ఎర్రయ్య, అచ్చయ్య, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

'సింగరేణి ఎన్నికలకు భయపడుతున్న ప్రభుత్వం'

సత్తుపల్లిరూరల్: సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం భయపడుతోందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య విమర్శించారు. సత్తుపల్లిలోని జేవీఆర్ ఓసీలో సోమవారం పర్యటించిన ఆయన కార్మికులతో మాట్లాడారు. కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం తమ యూనియన్ పోరాడుతోందని తెలిపారు. కార్మికులకు వేజ్‌బోర్డు సాధనలో కీలకంగా వ్యవహరించామని చెప్పారు. కాగా, సింగరేణిలో లాభాల వాటా, బోనస్‌ను యాజమాన్యం ఒకేసారి చెల్లించాలని, సింగరేణి కార్మికులు సీఎం ఇచ్చిన మామీ మేరకు ఇళ్ల నిర్మాణానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యూనియన్, సీపీఐ నాయకులు దండు ఆదినారాయణ, డి.శేషయ్య, వీరస్వామి, గట్టయ్య, ఎస్.సుధాకర్, జి.నర్సింహారావు, కాగితం వెంకటేశ్వర్లు, ఎస్.ప్రశాంత్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సీతారామయ్య

ఫెన్సింగ్ ధ్వంసం

జూలూరుపాడు: పొలం చుట్టూ ఉన్న ఫెన్సింగ్ ధ్వంసానికి పాల్పడిన వ్యక్తిపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. జూలూరుపాడుకు చెందిన ముదిగొండ లక్ష్మి, ముదిగొండ నాగయ్య కుటుంబాల మధ్య కొన్నేళ్లుగా భూ వివాదం ఉంది. ఈ క్రమంలో లక్ష్మికి మూడెకరాల పంట పొలం చుట్టూ ఉన్న ఫెన్సింగ్ పోల్స్‌ను ఈ నెల 8న రాత్రి నాగయ్య ధ్వంసం చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నాగయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.గణేష్ తెలిపారు.

నలుగురి అరెస్ట్

చర్ల: మావోయిస్టుల పేరుతో బొమ్మ తుపాకీ చూపించి వ్యాపారులు, కాంట్రాక్టర్ల వద్ద నుంచి డబ్బులు వసూలు చేస్తున్న నలుగురు వ్యక్తులను చర్ల పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. సీఐ బి.అశోక్ కథనం ప్రకారం... కొందరు వ్యక్తులు మావోయిస్టుల పేరుతో బెదిరిస్తున్నారంటూ ఫిర్యాదు అందడంతో పోలీసులు విచారణ చేపట్టారు. గన్నవరానికి చెందిన శ్యామల రాధాకృష్ణ, చినమిడిసిలేరుకు చెందిన శ్యామల జలంధర్, శ్యామల నవీన్, సీ.కొత్తూరుకు చెందిన తెల్లం సంతోష్ ముఠాగా ఏర్పడి వ్యాపారులు, కాంట్రాక్టర్ల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు తేలింది. వారిని అరెస్టు చేసి, రూ.2,370 నగదు, నకిలీ తుపాకీని స్వాధీనం చేసుకున్నారు.

వివాదాస్పద స్థలంలో గుడిసెలు


ఆక్రమణదారులతో మాట్లాడుతున్న అధికారులు

అశ్వారావుపేటరూరల్: ఓ వివాదాస్పద స్థలంలో సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం నిరుపేదలు అక్రమంగా గుడిసెలు నిర్మించారు. ఈ క్రమంలో స్థలాల కేటాయింపులో వారి మధ్య వాగ్వాదం జరిగింది. అశ్వారావుపేటలోని పామాయిల్ ఫ్యాక్టరీ ఎదురుగా ఇరువర్గాల మధ్య కోర్టు వివాదంలో ఉన్న ఐదెకరాల ఖాళీ స్థలంలో సోమవారం తెలవారుజామున పేదలు గుడిసెలు వేశారు. పార్టీ నాయకులు ఒక్కొక్కరికిగా రెండు సెంట్లు(96 గజాలు) చొప్పున దాదాపు 210 మందికి కేటాయించారు. మరో వంద మందికి స్థలం సరిపోకపోవడంతో వాగ్వాదానికి దిగారు. అనంతరం కెమిలాయిడ్స్ గెస్ట్ హౌస్ సమీపంలోని రెండెకరాల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించేందుకు తరలివచ్చారు. శుభ్రం చేస్తుండగా ఆర్ఐ అనిల్ అక్కడి చేరుకుని స్థలాన్ని ఖాళీ చేయాలని హెచ్చరించడంతో వెళ్లిపోయారు.

స్థలంలో ఫ్లెక్సీ ఏర్పాటు..తొలగింపు..

న్యాయస్థానం పరిధిలో ఉన్న ఈ వివాదాస్ప స్థలంలో సోమవారం రాత్రి తహసీల్దార్ లూథర్ విల్సన్, సీఐ బాలకృష్ణ, ఎస్సై బి.రాజేశ్ కుమార్ ఆధ్వర్యంలో బోర్డు ఏర్పాటు చేశారు. ఈ స్థలం న్యాయస్థానం పరిధిలో ఉందని, ఈ స్థలాన్ని ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని పేదలకు కౌన్సెలింగ్ చేశారు. కాగా అధికారులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని కొద్ది సేపటికే పేదలు చింపేశారు. దీంతో పోలీసులు, అధికారులు అక్కడి నుంచి వచ్చేశారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

చుంచుపల్లి: మండల పరిధిలోని విద్యానగర్‌లో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగిన సంఘటన సోమవారం వెలుగుచూసింది. విద్యానగర్‌లో నివాసం ఉంటున్న నారాయణ, విజయలక్ష్మి దంపతులు మూడు నెలల క్రితం ఇంటికి తాళం వేసి అమెరికాలో పిల్లల దగ్గరకు వెళ్లారు. ఈ క్రమంలో సోమవారం ఇంటి తాళం పగులగొట్టి ఉండటాన్ని స్థానికులు గమనించి చుంచుపల్లి పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చి పరిశీలించగా ఇంట్లో వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. పూర్తి వివరాలు సేకరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


ఇంట్లో చిందరవందరగా పడి ఉన్న వస్తువులు

భోజనంలో విష ప్రయోగం?

కారేపల్లి: తినే అన్నంలో విషప్రయోగం జరిగినట్లు తెలుస్తుండగా, ఓ మహిళ అస్వస్థతకు గురి కావడంతో ఆస్పత్రిలో చేర్పించారు. వివరాలు... కారేపల్లి పోస్టాఫీస్ రోడ్డులో నివాసం ఉంటున్న తురక లక్ష్మి స్థానికంగా చేపల వ్యాపారం చేస్తోంది. సోమవారం ఉదయం ఆమె పాత్రలోని అన్నాన్ని ప్లేట్‌లో వేసుకొని తింటుండగా పురుగుల మందు వాసన వచ్చింది. అప్పటికే కాస్త తిన్న ఆమె అస్వస్థతకు గురికాగా కుటుంబీకులు కారేపల్లి పీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స చేయించాక ఖమ్మం తరలించారు. ఇదిలా ఉండగా లక్ష్మితో కలిసి కుమారుడు, కోడలు, వారి పిల్లలు నివసిస్తున్నారు. అయితే, అన్నం గిన్నెలో మందు కలిపారా, ఇతర కారణాలతో ఆమె అస్వస్థతకు గురైందో తెలియాల్సి ఉంది.

ముగ్గురిపై కేసు నమోదు

అశ్వారావుపేటరూరల్: చంపుతామని బెదిరింపులకు పాల్పడిన ముగ్గురిపై సోమవారం రాత్రి పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై బి.రాజేశ్ కుమార్ కథనం ప్రకారం.. మండలంలోని పేరాయిగూడేనికి చెందిన నార్లపాటి సుదర్శన్, అదే గ్రామానికి చెందిన నార్లపాటి కిరణ్‌కుమార్, బేబి, తగరం ముత్తయ్యల మధ్య కొద్ది రోజులుగా భూ వివాదం నెలకొంది. ఈ క్రమంలో శనివారం పొలంలో పనులు చేస్తున్న సుదర్శన్‌ను ఆ ముగ్గురు దుర్భాషలాడారు. చంపుతామని బెదిరింపులకు పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

'అదృశ్యం' అవాస్తవం!

పవన్ కళ్యాణ్ ఆరోపణలు నిరాధారం: పోలీసు శాఖ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వేల మంది మహిళలు అదృశ్యమవుతున్నారని, అందుకు వలంటీర్లే కారణమంటూ జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవం, నిరాధారమని పోలీసు శాఖ స్పష్టం చేసింది. జాతీయ నేర గణాంకాల సంస్థ (ఎన్‌సీఆర్‌బీ) నివేదికను వక్రీకరించి ప్రజల్ని తప్పుదారి పట్టించేందుకే ప్రయత్నించారని ఓ ప్రకటనలో పేర్కొంది. దిశ వ్యవస్థ, జీరో ఎఫ్ఐఆర్ లాంటి సంస్కరణలతో దేశంలోనే మహిళా భద్రతలో ఆంధ్ర ప్రదేశ్ అగ్రగామిగా నిలిచిందని గుర్తు చేసింది. 2019–21 మధ్య రాష్ట్రంలో 30 వేల మంది మహిళల అదృశ్యం కేసులు నమోదు కాగా 14 వేల మంది ఆచూకీ మాత్రమే కనుగొన్నట్లు పవన్ కల్యాణ్ చేసిన ఆరోపణల్లో నిజం లేదని పేర్కొంది. ప్రేమ వ్యవహారాలు, పరీక్షల్లో ఫెయిల్ కావడం, ఇంట్లో ఘర్షణలు, మానసిక రుగ్మతలు తదితర కారణాలతో ఆచూకీ తెలియని కేసులన్నింటినీ పోలీసులు మిస్సింగ్ కేసులుగానే నమోదు చేస్తారు.

ఆచూకీ గుర్తించి సురక్షితంగా..

2019 – 21 మధ్య అదృశ్యమైన మహిళలు మొత్తం 24,557 మంది. 2019కు ముందు అదృశ్యమై ఆచూకీ లభించని మహిళలు 1,542 మంది. మొత్తంమీద 2021 నాటికి అదృశ్యమైన మహిళల సంఖ్య 26,099. వీరిలో 2021 డిసెంబర్ నాటికి 23,394 మంది ఆచూకీ కనుగొని కుటుంబ సభ్యుల వద్దకు చేర్చారు. మిగిలిన 2,705 మందిలో 500 మంది ఆచూకీని 2022–23లో కనుగొని కుటుంబ సభ్యుల వద్దకు చేర్చారు. హ్యూమన్ ట్రాఫికింగ్ (మానవ అక్రమ రవాణా)కు పాల్పడినట్లు రాష్ట్రంలో ఇప్పటివరకు ఒక్క వలంటీర్ పైనా ఎవరూ ఫిర్యాదు చేయలేదు. వారిపై ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. స్వచ్ఛంద సేవలో నిమగ్నమైన లక్షలాది మంది వలంటీర్లను కించపరుస్తూ వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఆరోపణలు చేయడం గర్హనీయం.

మరిన్ని వార్తలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

వలంటీర్ల ఆగ్రహ జ్వాల

పవన్ 'సంఘ విద్రోహ' వ్యాఖ్యలపై రాష్ట్రవ్యాప్తంగా నిరసన

ర్యాలీలు.. పలుచోట్ల దిష్టి బొమ్మలు, ఫొటోలకు నిప్పు



ప్రకాశం జిల్లా.. ఒంగోలు చర్చి సెంటర్‌లో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న వలంటీర్లు

సాక్షి, అమరావతి, నెట్‌వర్క్: గ్రామాల్లో ఆత్మీయులకు స్వచ్ఛందంగా సేవలందించే వలంటీర్లను జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ సంఘ విద్రోహ శక్తులతో పోల్చటంపై నిరసన జ్వాలలు భగ్గుమన్నాయి. అవ్వాతాతలు, అక్కచెల్లెమ్మలు ఆప్యాయంగా పలుకరించే వలంటీర్ సోదరులకు దురుద్దేశాలను ఆపాదించడంపై రాష్ట్రవ్యాప్తంగా ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. వలంటీర్లుగా దాదాపు 53 శాతం మంది యువతులు సేవలందిస్తుండగా సాటి మహిళలకు వారెందుకు చేటు చేస్తారని ప్రశ్నిస్తున్నారు. కోవిడ్ మహమ్మారి విరుచుకుపడ్డ వేళ బాధితుల వద్దకు వెళ్లేందుకు కుటుంబ సభ్యులే వెనుకాడినా వలంటీర్లు మానవత్వంతో అందించిన సేవలను గుర్తు చేస్తున్నారు. పవన్ తన వ్యాఖ్యలను బేషరతుగా ఉపసంహరించుకుని వలంటీర్లకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. పలుచోట్ల వలంటీర్లు ఆగ్రహంతో ఊగిపోతూ పవన్‌కళ్యాణ్ ఫోటోలు, పోస్టర్లను చెప్పుతో కొడుతూ నిరసన తెలిపారు. దిష్టి బొమ్మలు దగ్ధం చేశారు. జనసేన అధ్యక్షుడి అనుచిత వ్యాఖ్యలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ వలంటీర్లు నల్ల రిబ్బన్లు ధరించి విధులకు హాజరయ్యారు. 'సేవా భావంతో పనిచేసే మా వలంటీర్ల జోలికొస్తే తాట తీస్తాం..' అంటూ హెచ్చరించారు. నిన్న.. వలంటీర్లను మహిళల కిడ్నాప్‌లకు సహకరించే సంఘ విద్రోహులుగా అభివర్ణించిన పవన్‌కళ్యాణ్ తాజాగా వారు సేకరించే సమాచారం ఎక్కడెక్కడికో పోతోంది...! అది చాలా భయంకరమైన వ్యవస్థ.. ఇళ్లల్లోకి దూరుతున్నారు.. ! అవి ఊడిగం ఉద్యోగాలంటూ వలంటీర్ల ఆత్మాభిమానాన్ని కించపరిచేలా మరోసారి అనుచిత వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఏపీలో మహిళల కిడ్నాప్‌లకు సంబంధించి తనకు కేంద్ర నిఘా వర్గాల నుంచి సమాచారం ఉందని పవన్ చెబుతుండగా.. అదే నిజమైతే అలాంటి కీలక వివరాలను ఓ రాజకీయ నేతకు నిఘా వర్గాలు అందిస్తాయా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ మొత్తం వ్యవహారానికి స్క్రిప్టు సమకూర్చింది ఈనాడు రామోజీ కాగా చంద్రబాబు డైరెక్షన్‌లో పవన్ యాక్టింగ్ చేస్తున్నట్లు స్పష్టమవుతోంది.

పది రోజుల్లో ఆధారాలివ్వాలి

- పవన్‌కు రాష్ట్ర మహిళా కమిషన్ నోటీసు
- లేదంటే మహిళలకు బహిరంగ క్షమాపణ చెప్పాల్సిందే



మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మకు ఫిర్యాదు చేస్తున్న వాలంటీర్లు, మహిళా సంఘాల నేతలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వేల మంది మహిళలు అదృశ్యమయ్యారని, అందుకు వలంటీర్లే కారణమంటూ భయభ్రాంతులకు గురి చేసేలా జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యలు చేయడంపై రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ ఆందోళన వ్యక్తం చేశారు. తమను సంఘ విద్రోహ శక్తులుగా చిత్రీకరిస్తూ పవన్‌కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ పలువురు వలంటీర్లు, మహిళా సంఘాల నేతలు మహిళా కమిషన్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈమేరకు మంగళగిరిలోని మహిళా కమిషన్ ప్రధాన కార్యాలయంలో చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మను కలిశారు. నిరాధార ఆరోపణలు చేసిన పవన్‌పై తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం వాసిరెడ్డి పద్మ మీడియాతో మాట్లాడుతూ ఎలాంటి ఆధారాలు లేకుండా వలంటీర్లపై దారుణమైన కామెంట్లు చేసిన పవన్‌కు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. దీనిపై ఆధారాలతో పది రోజుల్లోగా మహిళా కమిషన్‌కు వివరణ ఇవ్వాలని లేదంటే మహిళలకు పవన్ బహిరంగ క్షమాపణ చెప్పాలని స్పష్టం చేశారు. ఒంటరి మహిళలను అవమానించేలా మాట్లాడిన పవన్ తన వద్ద ఉన్న కేంద్ర ఇంటెలిజెన్స్ సమాచారాన్ని బయట పెట్టాలని సూచించారు.

శ్రీవారి దర్శనానికి 36 గంటలు

తిరుమల: తిరుమలలో ఆదివారం అర్ధరాత్రి వరకు 88,836 మంది స్వామివారిని దర్శించుకున్నారు. కానుకల రూపంలో హుండీలో రూ.4.69 కోట్లు సమర్పించారు. దర్శన టికెట్లు లేని భక్తులకు 36 గంటల్లో దర్శనం లభిస్తోంది. కాగా, తిరుమలలో చిరుజల్లులు కురిశాయి. శ్రీవారి దర్శనం అనంతరం బయటకు వచ్చిన భక్తులు పరుగులు తీశారు.

అక్టోబర్‌లో నంది నాటకోత్సవాలు

సాక్షి, అమరావతి: నంది నాటకోత్సవాలను అక్టోబర్ నెలలో ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్, ఎక్స్ అఫిషియో సెక్రటరీ, ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ తుమ్మా విజయ్ కుమార్‌రెడ్డి వెల్లడించారు. ఈ ఏడాది నంది నాటకోత్సవాల్లో (రంగస్థల పురస్కారాలు) భాగంగా ఐదు విభాగాల్లో 73 అవార్డులను ప్రదానం చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. సోమవారం విజయవాడ ఆర్టీసీ కాన్ఫరెన్స్ హాల్‌లో నంది నాటకోత్సవాల నిర్వహణపై నాటక రంగ ప్రముఖులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. పద్య, సాంఘిక నాటకాలు, సాంఘిక నాటికలు, పిల్లల లఘు నాటిక, కళాశాల లేదా యూనివర్సిటీ లఘు నాటిక (ప్లేలెట్స్) అనే ఐదు విభాగాల్లో అవార్డులు అందజేయాలని నిర్ణయించామన్నారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను ఈ నెల 5న రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. ఆగస్టు 5వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణకు సమయం ఇచ్చామని తెలిపారు. అందరికీ అనుకూలంగా ఉండే ప్రాంతాన్ని నంది నాటకోత్సవాలకు వేదికగా ఎంపిక చేస్తామని తెలిపారు.

మినిస్టర్ క్వార్టర్స్ నీటి బకాయిలు రూ 4.34 కోట్లు!



బంజారాహిల్స్‌లోని మినిస్టర్ క్వార్టర్స్

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని మంత్రుల నివాస సముదాయాల మంచినీటి బిల్లులు రోజురోజుకు పెరిగిపోతుండటంతో జలమండలి అధికారులు పెండింగ్ బిల్లులు రాబట్టుకోలేక సతమతమవుతున్నారు. మినిస్టర్ క్వార్టర్స్ వాటర్ కనెక్షన్లు కట్ చేయడానికి కూడా వెనుకాడబోమని ఈ ఏడాది మార్చిలో హెచ్చరికలు జారీ చేసినా సంబంధిత ఆర్అండ్‌బీ అధికారులు స్పందించడం లేదు. బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో 32 క్వార్టర్స్ ఉన్నాయి. 2009 నుంచి ఈ క్వార్టర్స్‌కు సంబంధించిన మంచినీటి బిల్లులు చెల్లించకపోవడంతో యేటికాయేడు అవి చాంతాడంత పెరిగిపోతున్నాయి. ఇప్పటికీ బిల్లుల బకాయిలు రూ.4.34 కోట్లకు చేరుకున్నాయి. ఉమ్మడి ఏపీ నుంచే ఈ బిల్లులు బకాయి ఉన్నాయని జలమండలి అధికారులు పేర్కొంటున్నారు. ఈ ఏడాది మార్చి 15వ తేదీన ఆర్అండ్‌బీ ఈఈ ఆర్అండ్‌బీ ఎస్ఈకి వాటర్ బిల్లులు విడుదల చేయాల్సిందిగా లేఖ కూడా రాశారు. ఇప్పటిదాకా దానికి స్పందన కరువైంది. బకాయిలు చెల్లించాలని జలమండలి అధికారులు ఎన్నోసార్లు ఆర్అండ్‌బి అధికారులకు లేఖలు రాయడమే కాకుండా మొరపెట్టుకుంటున్నారు. భారీగా బకాయిలు పేరుకుపోయాయని బోర్డుకు నష్టంవాటిల్లుతుందని ఆందోళన కూడా వ్యక్తం చేశారు. కొంతనైనా చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. వాటర్ కనెక్షన్లు కట్‌చేయకముందే చెల్లించండి అంటూ వేడుకున్నారు. అయినాసరే ఆర్అండ్‌బి అధికారులు కనికరించడం లేదు. సామాన్యులు ఒక నెల బిల్లు చెల్లించకపోతే వాటర్ కనెక్షన్ కట్‌చేసే జలమండలి అధికారులు మంత్రులు బిల్లులు చెల్లించకపోతే మాత్రం పుష్కర కాలంగా నోరెత్తడం లేదు. ఈ విషయంలో ఆర్అండ్‌బి అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నది. సామాన్యులకు ఒక న్యాయం, అమాత్యులకు మరో న్యాయమా అంటూ పలువురు విమర్శిస్తున్నారు.

ఇంకా చెల్లించని కరెంటు బకాయిలు

మినిస్టర్ క్వార్టర్స్‌లో కరెంటు బకాయిలు ఏ నెలకానెల పెరిగిపోతున్నాయి. 2022 ఆగస్టు నుంచి మినిస్టర్ క్వార్టర్స్ కరెంటు బిల్లులు చెల్లించకపోవడంతో ఇప్పటికే ' 70 లక్షల బకాయిలు పేరుకుపోయాయి. ఈ బిల్లులు చెల్లించాలంటూ విద్యుత్ శాఖ అధికారులు సంబంధిత ఆర్అండ్‌బి అధికారులను వేడుకుంటున్నా స్పందన కరువవుతున్నది. భారీగా కరెంటు బిల్లులు పేరుకుపోతుండటంతో సంబంధిత ఏఈలకు విద్యుత్ ఉన్నతాధికారులు మెమోలు జారీచేస్తున్నారు ఇంక్రిమెంట్లు కట్ చేస్తున్నారు. ప్రతిరోజూ పెండింగ్ బిల్లుల వసూళ్లు ఎంత వరకు వచ్చాయంటూ తీవ్ర ఒత్తిడి తీసుకొస్తున్నారు. అమాత్యులు మాత్రం స్పందించకపోగా ఈ బిల్లులు చెల్లించాల్సిన ఆర్అండ్‌బి ఇంజనీర్లు నోరెత్తడం లేదు.

రూ.5 వేలకు ఊడిగం చేసే ఉద్యోగం 'వలంటీరు'

- సున్నితమైన సమాచారాన్ని వలంటీర్లు సేకరిస్తున్నారు
- వితంతువులు, ఒంటరి మహిళలు జాగ్రత్తగా ఉండాలి
- ఏలూరు జనసేన వీర మహిళల సమావేశంలో పవన్‌కళ్యాణ్



సాక్షి ప్రతినిధి, ఏలూరు : 'వలంటీరు పోస్టు అనేది రూ.ఐదు వేలకు ఊడిగం చేసే ఉద్యోగం. ఐదు లక్షల మంది వలంటీర్లకు ప్రజల డబ్బుతో జీతం ఇస్తున్నారు. వలంటీర్లు ప్రభుత్వోద్యోగులు కానప్పుడు.. ప్రభుత్వంలో అనేక వ్యవస్థలు ఉన్నప్పుడు వలంటీర్లతో అసలు పనేముంది?'.. అంటూ జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ వలంటీరు వ్యవస్థపై మరోసారి నోరుపారేసుకున్నారు. ఏలూరు నగరంలో సోమవారం సాయంత్రం జరిగిన నియోజకవర్గస్థాయి కార్యకర్తలు, వీర మహిళల సమావేశంలో పవన్ మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే.. జనసైనికులు అవసరమైతే వలంటీర్లను నిలదీయాలి. ఏపీలో ఎంతమంది అమ్మాయిలు మిస్సవుతున్నారో ఆ డేటా మీ దగ్గర ఉందా అని, నిఘా వర్గాల్లో ముఖ్యులు నన్ను అడిగితే నా మతిపోయింది. ప్రతి గ్రామంలో పదిమంది యువకులు వలంటీర్ల పేరుతో ఇంటింటికీ తిరుగుతూ సున్నితమైన సమాచారాన్ని సేకరిస్తున్నారు. భార్యాభర్తల మధ్య గొడవలున్నాయా.. వితంతు మహిళలున్నారా, భర్తలు బయటకు వెళ్లాక భార్యలు ఏం చేస్తున్నారు? ఇలా సున్నితమైన సమాచారాన్ని సేకరిస్తున్నారు. వలంటీర్ల వ్యవస్థ పెట్టిన మొదట్లో జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ బలోపేతానికి అని అనుకున్నాం. కానీ, ఇది చాలాచాలా భయంకరమైన వ్యవస్థగా మారిపోయింది. ఇది అందరి వలంటీర్ల గురించి కాదు.. కొందరి గురించే. అయితే, డేటా మాత్రం కచ్చితంగా వెళ్తోంది. వలంటీర్లు తప్పుచేస్తే ఎవరికి చెప్పాలి. వారేమో ప్రభుత్వోద్యోగులు కాదంటారు. వలంటీర్లు ఇబ్బంది పెడుతుంటే టోల్‌ఫ్రీ నంబర్ ఉండాలి. ఇక రేషన్ డీలర్ల వ్యవస్థను చంపేసి 10 వేల వ్యాన్లు ఇచ్చారు. ఈ వ్యవస్థపై పర్యవేక్షణలేదు. వితంతు మహిళలు, ఒంటరి మహిళలు జాగ్రత్తగా ఉండాలి.

జిల్లా వార్తలు

ఓపెన్ స్కూల్స్ ప్రవేశాలు ప్రారంభం

ఖమ్మంసహకారనగర్/కొత్తగూడెంఅర్బన్: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఈ.సోమశేఖరశర్మ, ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు తెలిపారు. పదో తరగతిలో ప్రవేశానికి 14 ఏళ్లు, ఇంటర్‌లో 15 ఏళ్లు నిండిన వారు అర్హులని తెలిపారు. పదో తరగతిలో ప్రవేశానికి జనరల్ పురుషులైతే రూ.1,550, ఇంటర్‌లో ప్రవేశాల కోసం రూ.1,800, పదో తరగతిలో చేరేందుకు మహిళలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ, మైనార్టీ అభ్యర్థులు రూ.1,150, ఇంటర్‌లో ప్రవేశాల కోసం రూ.1,500 ఫీజు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వచ్చే నెల 10వ తేదీ వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఫీజు చెల్లించవచ్చని, ఆగస్టు 11నుంచి 31వ తేదీ వరకు అపరాధ రుసుంతో ఫీజు చెల్లింపునకు అవకాశముందని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు టీఎస్ ఆన్‌లైన్, మీ సేవ, ఏపీ ఆన్‌లైన్, తెలంగాణ ఓపెన్ స్కూల్ వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుని ఫీజు చెల్లించాక దరఖాస్తు ఫారం, ధ్రువపత్రాలతో సెంటర్లలో సంప్రదించాలని, వివరాలకు 80084 03522 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

పురోహితుల క్రికెట్ టోర్నీ విజేత మోపిదేవి జట్టు



మోపిదేవి జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మం స్తంభాద్రి పురోహితుల సంఘం ఆధ్వర్యంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ స్థాయి క్రికెట్ పోటీలు సోమవారం ముగిశాయి. ఖమ్మంలోని సర్దార్ పటేల్‌స్టేడియంలో జరిగిన ఈ పోటీల్లో విజేతగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మోపిదేవి జట్టు నిలిచింది. అలాగే, ద్వితీయస్థానంలో మహాదేవ్ హైదరాబాద్ జట్టు, మూడోస్థానంలో అన్నవరం, నాలుగోస్థానంలో విజయవాడ జట్లు నిలవగా ట్రోఫీలు అందజేశారు. డాక్టర్ కూరపాటి ప్రదీప్‌కుమార్, ఎం.డీ.మతీన్, ఓలేటి సాంబమూర్తి, పోటీల నిర్వాహకులు ప్రశాంతాచార్యులు, శేషాభట్టర్, రంగావఝ్ఝల దిలీప్‌శర్మ, అవధానుల సాయినాథ్ వర్మ, అనిరుధ్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల కన్నీటి వేదన



కనీస వేతనాల కోసం పోస్టుకార్డ్ ఉద్యమం చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు (ఫైల్)

- సింగరేణిలో అందని కనీస వేతనాలు
- సంస్థవ్యాప్తంగా 32 వేల మంది కార్మికులు
- కోలిండియా పరిధిలో అమలవుతున్నా సింగరేణిలో మొండిచేయి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ వ్యాప్తంగా సుమారు ఇరవై ఏళ్ల క్రితం 1.16లక్షల మంది పర్మనెంట్ కార్మికులు విధులు నిర్వర్తించగా.. ఆ సమయాన లోడింగ్, అన్ లోడింగ్, శ్యాండ్ బంకర్లు, బొగ్గు రవాణా విభాగాల్లో మాత్రమే వంద మంది వరకు కాంట్రాక్ట్ కార్మికులు పని చేసేవారు. కానీ నేడు సింగరేణి వ్యాప్తంగా 42వేల మంది పర్మనెంట్ కార్మికులు, 32 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారు. అంటే పర్మనెంట్ కార్మికుల సంఖ్యను గణనీయంగా తగ్గించి కాంట్రాక్ట్ కార్మికుల సంఖ్యను పెంచుతూ వెళుతున్నట్లు ఈ గణాంకాల ద్వారా తెలుసుకోవచ్చు. కానీ వీరికి వేతనాల చెల్లింపులో మాత్రం సవతి తల్లి ప్రేమనే కనబరుస్తుందన్న విమర్శలు వస్తున్నాయి. కనీస వేతనాల మాటేమో కానీ ఇతర సౌకర్యాల అమలులో కూడా యాజమాన్యం విఫలమైందని కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యాన కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ కమిటీ సూచనల మేరకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలనే డిమాండ్‌తో సింగరేణివ్యాప్తంగా కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు ఆందోళనలు చేపడుతున్నారు.

ఆరు విభాగాల్లో తప్ప...

సింగరేణిలో పనులు 56కి పైగా విభాగాల ద్వారా సాగుతున్నాయి. ఇందులో ఆరు తప్ప మిగతా విభాగాల్లో కాంట్రాక్ట్ కార్మికులదే కీలకపాత్ర అని చెప్పాలి. అంతేకాక ఏటా అప్రెంటిస్ షిప్ ద్వారా కొత్త వారిని నియమిస్తూ గనులు, వర్క్‌షాప్‌ల్లో నేర్పిస్తూ పని చేయిస్తున్నారు. ఇలా సింగరేణి వ్యాప్తంగా వివిధ రీజియన్లలో 32 వేల మంది కాంట్రాక్టు కార్మికులు పని చేస్తున్నారు. వీరిలో అన్‌స్కిల్డ్ కార్మికులకు రోజూ రూ.437, సెమీ స్కిల్డ్ కార్మికులకు రూ.510, స్కిల్డ్ కార్మికులకు 610 చెల్లించాల్సి ఉంటుంది. కానీ సోలార్, లోడింగ్, అన్ లోడింగ్, సులభ్ కాంప్లెక్స్, నర్సరీ, సివిక్ విభాగాలలో ఇవి అమలు చేయటం లేదు.

అమలు కాని హైపవర్ కమిటీ సూచనలు

సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ వేతనాలు అమలు చేయాలని 2013లో జరిగిన 8వ వేతన ఒప్పంద సమావేశంలో సూచించారు. తద్వారా కోలిండియా వ్యాప్తంగా బొగ్గు పరిశ్రమల్లో కాంట్రాక్ట్ కార్మికులకు రోజుకు రూ.930 చెల్లించాల్సి ఉంటుంది. ఈ నిర్ణయం కోలిండియా పరిధిలోని పరిశ్రమల్లో అమలవుతున్నా సింగరేణిలో మాత్రం అమలుకు నోచుకోలేదు. అంతేకాక బొగ్గు ఉత్పత్తి ప్రాంతాలు, అండర్ గ్రౌండ్‌లో పర్మనెంట్ కార్మికులతో సమానంగా కాంట్రాక్ట్ కార్మికులకు వేతనం అమలు చేయాలని 2016లో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా కూడా అమలుకాకపోవడం గమనార్హం. కాగా, కోలిండియా పరిధిలోని ఇతర సంస్థల్లో మాత్రం కాంట్రాక్ట్ కార్మికులకు పర్మనెంట్ కార్మికులతోపాటు సమానంగా సౌకర్యాలు కల్పిస్తూనే వేతనాలు చెల్లిస్తున్నారు. అంతేకుండా ప్రతి నెల రూ.3,500 అలవెన్స్ కూడా అందుతోంది. కానీ సింగరేణిలో అలా చేయకపోవడంతో కార్మికులు ఆవేదన చెందుతున్నారు. ఈ విషయమై జీఎం పర్సనల్ (ఐఆర్‌పీఎం) బి.హన్మంతరావును వివరణ కోరగా.. సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు, సౌకర్యాల విషయమై త్వరలోనే కమిటీ వేయనున్నామని తెలిపారు.

ఒకటో కేటగిరీ వేతనం అమలుచేయాలి



సింగరేణిలో హైపవర్ వేతనాలు, సమాన పనికి సమాన వేతనం అమలుచేయాలి. ఎన్నిమార్లు విన్నవించినా ఈ విషయంలో సంస్థ తాత్సారం చేస్తున్న నేపథ్యాన కాంట్రాక్ట్, జాతీయ కార్మిక సంఘాల సమన్వయంతో ఆందోళనలు చేపడుతాం. సమ్మెకైనా వెనుకాడేది లేదు.

– ఎస్.సంజీవ్, ఇఫ్టూ నాయకుడు

కోలిండియాలో మాదిరి చెల్లించాలి



సింగరేణిలోని కాంట్రాక్ట్ కార్మికులకు కోలిండియా మాదిరిగా రోజుకు రూ.950 చెల్లించాలి, ఇప్పటికే కేంద్ర కనీస వేతనాల చైర్మన్‌తో ఈ విషయమై చర్చించాం. కాంట్రాక్ట్ కార్మికులకు సెలవులు, పెన్షన్, మెరుగైన వేతనాలు అందించాలనే డిమాండ్‌తో ఆందోళనలు చేపడతాం.

– మాధవనాయక్, ఏబీకేఎంఎస్ నాయకుడు

అరకొర వేతనాలతో ఇబ్బంది

సింగరేణిలో ఉద్యోగమంటే బతుకులకు భరోసా అనుకున్నాం. కానీ యాజమాన్యం కొంత, కాంట్రాక్టర్లు మరికొంత మాకు అన్యాయం చేస్తున్నారు. అరకొర వేతనాలు చెల్లిస్తుండడంతో ఇబ్బందిగా ఉంది. ఇకనైనా ఉన్నతాధికారులు చొరవ తీసుకుని న్యాయం చేయాలి.

– ఈ.నాగేశ్వరరావు, కాంట్రాక్ట్ ఉద్యోగి

కార్మికుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించండి



ధర్నా శిబిరంలో మాట్లాడుతున్న పోటు రంగారావు

ఇల్లెందు: గ్రామపంచాయతీల కార్మికులు, మధ్యాహ్న భోజనం వర్కర్లకు చట్టపరమైన హక్కులు కల్పిస్తూ వారి సమస్యలు పరిష్కరించాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు డిమాండ్ చేశారు. ఇల్లెందులో గ్రామపంచాయతీ వర్కర్లు, మధ్యాహ్న భోజన వర్కర్ల నిరసన శిబిరాలను సోమవారం ఆయన సందర్శించి సంఘీభావం తెలిపి మాట్లాడారు. పంచాయతీ కార్మికులు, మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని విడనాడి తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, నాయకులు నాయిని రాజు, పూనెం కుమార్, శాంతయ్య, ఈసం శంకర్, అజయ్, బుర్ర వెంకన్న, పాయం వెంకన్న, యాకుబ్‌షావలీ, బొర్రా వెంకన్న, తెల్లం రాజు పాల్గొన్నారు.

స్పెషలిస్ట్ వైద్యుల నియామకానికి ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న డైరెక్టర్ బలరామ్, అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి పరిధిలోని ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న స్పెషలిస్ట్ వైద్యుల నియామకానికి సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో డైరెక్టర్(పా) ఎస్.బలరాం ఈ ఇంటర్వ్యూలు నిర్వహించగా జీఎం పర్సనల్(ఐఆర్‌పీఎం) కట్టా బసవయ్య, సీఎంఓ బి.వెంకటేశ్వరరావు, డీజీఎం దస్‌పాల్ శ్రీనివాస్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు. మొత్తం 25 పోస్టులను ఏడాది కాలానికి భర్తీ చేయనుండగా తొలిరోజు హాజరై ఇరవై మంది సర్టిఫికెట్లు పరిశీలించారు.

ఆన్‌లైన్‌లో క్వార్టర్ల వివరాలు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ పరిధిలో నిర్మించిన క్వార్టర్ల వివరాలను ఇక నుంచి ఆన్‌లైన్‌లో పొందుపర్చనున్నారు. ఈమేరకు సోమవారం డైరెక్టర్ బలరామ్ క్వార్టర్ల వివరాలతో పాటు కార్మికుల సీనియారిటీ జాబితాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. తద్వారా క్వార్టర్ల అన్యాక్రాంతం కాకుండా చూడడంతో పాటు దరఖాస్తులు, కేటాయింపు వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అధికారులు కట్టా బసవయ్య, మురళీధర్, హరప్రసాద్, వేణు తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రి జిల్లాలో తమిళనాడు పీసీసీఎఫ్ పర్యటన



భద్రాద్రి రామాలయంలో తమిళనాడు పీసీసీఎఫ్ రాజేశ్వరితో ఈఓ రమాదేవి, తదితరులు

భద్రాచలం/దుమ్ముగూడెం/పాల్వంచ రూరల్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో తమిళనాడు అటవీశాఖకు చెందిన ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ పి.రాజేశ్వరి సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె ఏపీకి చెందిన వైద్య, ఆరోగ్య శాఖ జేడీ కె.అరుణాదేవితో పాటు హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ సి.హేమ, డాక్టర్ అనురాధ, భద్రాచలం ఆర్డీఓ రత్నకళ్యాణితో కలిసి భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో మూలమూర్తులకు పూజలు చేయగా, పండితులు వేదాశీర్వచనం, ఈఓ రమాదేవి స్వామి వారి ప్రసాదం, జ్ఞాపికలు అందచేశారు. అలాగే, దుమ్ముగూడెం మండలం పర్ణశాలలో కూడా శ్రీ సీతారామచంద్రస్వామి వారిని దర్శించుకుని పంచవటీ కుటీరం, నారచీరల ప్రాంతాల విశిష్టతలు తెలుసుకున్నారు. అనంతరం పాల్వంచ మండలం కిన్నెరసానిలో పర్యటించిన వారు డీర్‌పార్కులోని దుప్పులు, ప్రాజెక్టు పైనుంచి జలాశయం, పర్యావరణ కేంద్రాన్ని వీక్షించి రిజర్వాయర్‌లో బోటు షికారు చేశారు. అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు లక్ష్మయ్య, శ్రీను, నందా, శ్రీనివాసరావు, రవికుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతలపై కేసులు ఎత్తివేయాలి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ కనకయ్య

కామేపల్లి(కారేపల్లి): అధికారపార్టీ నేతల సూచనలతో పోలీసులు అత్యుత్సాహంగా కాంగ్రెస్ నాయకులపై కేసులు బనాయించి ఇబ్బంది పెడుతున్నారని భద్రాద్రి కొత్తగూడెం జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య ఆరోపించారు. కామేపల్లి మండలంలోని తాళ్లగూడెం పోలీసుస్టేషన్ సమపాన ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఇటీవల పండితాపురంలో జరిగిన ఘర్షణతో తమ పార్టీ నాయకుడు, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్‌కు సంబంధం లేకున్నా పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారన్నారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల సూచనలతో పోలీసులు వాస్తవాలకు పట్టించుకోవడం లేదని, ఇకనైనా తీరు మార్చుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు తుంబూరి దయాకర్‌రెడ్డి, షేక్ ఫతే అహ్మద్, మేకల మల్లికార్జున్, శీలం పుల్లయ్య, శ్రీను, ప్రసాద్, నాగేంద్రబాబు, వేణు, నాగేశ్వరరావు, శేఖర్, నరేష్, ఇమ్మడి తిరుపతిరావు, మల్లేల నాగేశ్వరరావు పాల్గొన్నారు.